

ఎంపీ ఈటల రాజేందర్‌కు సమస్యలను వివరిస్తున్న భరత్ సింహారెడ్డి

సుచిత్రా బ్రిడ్జిని పరిశీలించిన ఎంపీ ఈటల

పేట్‌బషీరాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్ సుచిత్రా చౌరస్తాలోని బ్రిడ్జి, సర్వీస్ రోడ్లను మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, రైల్వే అధికారులు, స్థానిక నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సుచిత్రా కూడలిలో ట్రాఫిక్ సమస్య తీవ్రతరంగా ఉందని, రైల్వేట్రాక్ వద్ద సబ్ రోడ్డు, కుత్బుల్లాపూర్ నుంచి అల్వాల్ వెళ్లే సుచిత్రాచౌరస్తాలో అండర్ పాస్ రోడ్డు లైన్ వేయించాలని, బ్రిడ్జి వెడల్పు చేయాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఎంపీ ఈటల రాజేందర్‌కు వివరించారు. ప్రయాణికులకు అనుకూలంగా ఉండేలా బ్రిడ్జి వెడల్పు, రైల్వే పట్టాల పక్కనే సర్వీస్ రోడ్లు నిర్మించాలని ఈ సందర్భంగా ఎంపీ ఈటల రైల్వే అధికారులకు సూచించారు. ఎంపీ ఈటల వెంట నాయకులు గిరివర్ధన్‌రెడ్డి, రాజిరెడ్డి, శివాజీరాజ్, ప్రభాకర్‌రెడ్డి, సతీష్, రాజు తదితరులున్నారు.



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న కృష్ణానగర్ కాలనీవాసులు

కృష్ణానగర్ కాలనీలో సమస్యలను పరిష్కరించాలి

వివేకానందనగర్‌కాలనీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ డివిజన్ కృష్ణానగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, కాలనీలో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని అసోసియేషన్ సభ్యులు కోరారు. వారన్నారు. గురువారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని సప్తగిరికాలనీలోని ఆయన నివాసంలో కలిసి వారు వినతిపత్రం అందజేశారు. కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ, రోడ్ల సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. త్వరలోనే సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌యాదవ్, కాలనీవాసులు నర్సింగరావు, వెంకటేష్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, వీరభద్ర, సూర్యనారాయణ, అశోక్, ఫణి రాజు, కృష్ణారావు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో మరో వ్యక్తి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితుడు శ్రీశైలం

కూకట్‌పల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు మద్యం తాగొద్దన్నందుకు అతడిపై దాడి చేసి బీరుసీసాతో పొడిచిన కేసులో మరో నిందితుడిని కూకట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ కె. ముత్తు తెలిపిన వివరాల ప్రకారం... మూసాపేట జనతానగర్‌లో ఉంటున్న సురేష్ ఇంటి ఎదుట... మూసాపేట యాదవబస్తీకి చెందిన హేమారావు(24), డొల్లా శ్రీశైలం (23) రోజూ మద్యం తాగుతూ న్యూసెన్స్ చేస్తూ ఉండేవారు. ఇక్కడ మద్యం తాగి న్యూసెన్స్ చేయొద్దని సురేష్ చెప్పాడు. అది మనస్సులో పెట్టుకున్న హేమారావు, శ్రీశైలం ఈ నెల 7న సురేష్ ఇంటి వద్దకు వెళ్లి తమ వెంట తెచ్చుకున్న పగిలిన బీరు సీసాతో మెడపై పొడిచి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి హేమారావును గత మంగళవారం అరెస్టు చేన్నారు. పరారీలో ఉన్న శ్రీశైలంను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్ తరలించామని తెలిపారు.

మాటలు రాని బాలుడి అదృశ్యం



అజ్మల్ అలీఖాన్

అల్లాపూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పదిహేనేళ్ల దివ్యాంగ బాలుడు కనిపించకుండా పోయాడు. ఈ ఘటన అల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అల్లాపూర్ డివిజన్ సప్ధర్‌నగర్‌కు చెందిన అజ్మల్ సకావత్ అలీ ఖాన్(15) బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దాంతో తండి మహ్మద్ షాహిద్ అలీఖాన్ అల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన కుమారుడికి మాటలు సరిగా రావని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పని కోసం వెళ్లిన గృహిణి..



స్వరూప

పేట్‌బషీరాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): పని కోసం వెళ్లిన గృహిణి కనిపించకుండా పోయింది. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జీడిమెట్ల జయరామ్‌నగర్‌కు చెందిన స్వరూప, కాశీరాం భార్యాభర్తలు. స్వరూప స్థానికంగా ఓ స్వీట్ షాప్‌లో పనిచేస్తుంది. ఈ నెల 9వ తేదీ ఉదయం 8 గంటలకు పిల్లలను ఇంట్లోనే వదిలి పనికి వెళ్లి, సాయంత్రం అయినా తిరిగి రాలేదు. భర్త ఆమె సెల్ నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దాంతో అతడు స్వీట్ షాపునకు వెళ్లి విచారించగా, డ్యూటీకి రాలేదని అక్కడి వారు చెప్పారు. అమె కోసం అన్ని చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త కాశీరాం గురువారం పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

గాజులరామారం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సూరారం సీఐ భరత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం తెలుగుతల్లి నగర్‌కు చెందిన జే నాగరాజు(29) తల్లి చనిపోవడంతో అమ్మమ్మ కనకమ్మ ఇంటి వద్ద ఉంటున్నాడు. సంవత్సరం క్రితం మమత అనే మహిళను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ సమయంలో అమ్మమ్మ ఆ దంపతులకు కొంత బంగారం ఇచ్చింది. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో నాగరాజు బంగారాన్ని తాకట్టు పెట్టాడు. ఈ నెల 10న అమ్మమ్మ కనకమ్మ తాకట్టు పెట్టిన బంగారం విడిపించుకు రావాలని అడిగింది. తాకట్టుపెట్టిన బంగారాన్ని తీసుకురాలేక, ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ అవ్వడంతో మనస్థాపం చెందిన నాగరాజు ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మమత పోలీసులకు సమాచారం ఇచ్చింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

9.2 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

● ఇద్దరి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు పట్టుకున్న లారీ

దుండిగల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా లారీలో తరలిస్తున్న ఇద్దరిని మేడ్చల్ ఎస్‌వోటీ, దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 29.2 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దుండిగల్ సీఐ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం 9 గంటల సమయంలో దుండిగల్ ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెంబర్-5 వైపు నుంచి వెళ్తున్న లారీని ఆపి చూడగా, అందులో రేషన్ బియ్యం ఉన్నాయి. మహారాష్ట్ర ప్రాంతంలోని నాందేడ్, డిగ్లోర్‌నాకాకు చెందిన లారీ డ్రైవర్ షేక్ దస్తగిరి(25), అదే ప్రాంతానికి చెందిన క్లీనర్ షేక్ రిజ్వాన్(24)ను అదుపులోకి తీసుకుని విచారించారు. మలక్‌పేటలో ఉంటున్న అహ్మద్ హుస్సేన్ వద్ద రేషన్ బియ్యం తీసుకుని నాందేడులో ఉంటున్న ఇమ్రాన్‌కు ఇవ్వడానికి వెళ్తున్నట్లు చెప్పారు. ఈనెల10వతేదీన మలక్‌పేట్‌లోని పిల్లర్‌నెంబర్ 1390 వద్ద నుంచి అహ్మద్‌హుస్సేన్‌కు ఫోన్‌చేయగా సాయంత్రం 4గంటలకు వచ్చి బియ్యం లోడ్ చేశాడు. 11వతేది 7 గంటలకు బియ్యం లోడుతో నాందేడ్‌కు బయలు దేరిన వీరిని పోలీసులు అరెస్ట్‌చేశారు. వీరిద్దని రిమాండ్‌కు తరలించారు. మరో ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నట్టు సీఐ శంకరయ్య తెలిపారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి
● డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలి
● సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
● జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి, జూలై11 (ఆంధ్రజ్యోతి): వెస్ట్‌జోన్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో డెంగీ నివారణకు చర్యలు చేపట్టి, ప్రజలకు అవగాహన కల్పించాలని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాం కాలం కావడంతో ప్రజారోగ్యంపై శ్రద్ధవహించాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. గురువారం తన చాంబర్‌లో అన్ని విభాగాల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగీ వ్యాధిపట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని, ప్రభుత్వ, ప్రభుత్వేతర విద్యాసంస్థలు, కాలనీలు, బస్తీల్లో ప్రజలను చైతన్యపరచాలని అధికారులకు జోనల్ కమిషనర్ సూచించారు. పారిశుధ్య, ఎంటమాలజీ అనుబంధ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వర్షపునీరు, మురుగునీరు నిల్వవుండకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. సెల్లార్‌ల్లో వర్షపునీరు నిల్వ ప్రాంతాలను గుర్తించి తక్షణమే ఎంటమాలజీ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, ఫాగింగ్ విధిగా చేయాలని పేర్కొన్నారు. బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, డిప్యూటీ వైద్యాధికారులు, ఏఈలు ఆయా ప్రాంతాల్లో సందర్శించి జ్వరం కేసులపై ఆరా తీయాలన్నారు. వర్షాకాలం ముగిసే వరకు క్షేత్రస్థాయిలో అన్నివిభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో ఉపకమిషనర్లు రజనీకాంత్‌రెడ్డి, వంశీకృష్ణ, సురేష్, వైద్యాధికారులు, ఎంటమాలజీ, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శునకాల క్రిమీటోరియంను పరిశీలించిన జడ్‌సీ



గోపన్‌పల్లిలో క్రిమిటోరియం

శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో గోపన్‌పల్లిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శునకాల స్టెరిలైజేషన్ ప్రక్రియను డీడీ విల్సన్, బాసిత్ ఏర్పాటు చేసిన కుక్కల శ్మశానవాటిక (క్రిమీటోరియం)ను జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పరిశీలించారు. మెషిన్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం నల్లగండ్ల హుడాకాలనీలో ఆయన పర్యటించారు. పరిసర ప్రాంత రహదారులపై పేరుకుపోయిన చెత్తను గుర్తించిన ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో ఈవిధంగా ఉంటే అంటు వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని వెంటనే చెత్తను తరలించాలని అధికారులను ఆదేశించారు. చందానగర్ ఆర్టీసీ కాలనీలో ఆర్‌వోబీ రోడ్డును ఉపకమిషనర్ వంశీకృష్ణ, కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రహదారి ఇప్పటికే ఆమోదం పొందిన నేపథ్యంలో పున పరిశీలన, మార్పు సాధ్యాసాధ్యాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని జడ్‌సీ తెలిపారు. ఆర్టీసీ కాలనీ వద్ద నిర్మించే ఆర్‌ఓబీ విస్తర్ణలో ఆస్తులు ప్రభావితమయ్యే యజమానులతో కలిసి ఆర్‌ఓబీని రీ అలైన్‌మెంట్ చేయాలని జగదీశ్వర్‌గౌడ్ జడ్‌సీని కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకునేలా చూస్తానని జడ్‌సీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పరిశ్రమ అభివృద్ధికి ప్రతీ కార్మికుడు కృషి చేయాలి



నూతన కమిటీతో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్

భెల్‌కాలనీ,జూలై 11 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమ అభివృద్ధికి, కార్మిక సంక్షేమానికి కృషి చేసేవారికే కార్మికుల సహకారం ఉంటుందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.యూసుఫ్ పేర్కొన్నారు. అధికార కార్మిక సంఘం బీహెచ్‌ఈఎల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం, నూతన కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన యూసుఫ్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. బీహెచ్‌ఈఎల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా ఎస్‌డీవీ. కృష్ణంరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహేశ్వర్‌బాబు, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.మోహన్, ఉపాధ్యక్షులుగా యాదిరెడ్డి, రాజ్‌కుమార్‌బాబు, డి.రాజ్‌కుమార్, గుల్ మొహమ్మద్ ఖాన్, ప్రధాన కార్యదర్శిగా పి.వినోద్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా సతీష్‌కుమార్, టౌన్‌షిప్ అడ్వైజరీ కమిటీ హెడ్, వర్కింగ్ ప్రెసిడెండ్ సతీష్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కుర్రా అంకం రాజు, జె.నర్సింలు, హరిసింగ్, షేక్ మున్నా, మధుకుమార్, కోశాధికారిగా ఎంఎన్ఎల్ శ్రీనివాస్‌రావు, నూతన కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

కార్మికుల సంక్షేమమే ఏఐటీయూసీ ధ్యేయం: కృష్ణంరాజు

ఈ సందర్భంగా అధ్యక్షుడు కృష్ణంరాజు మాట్లాడుతూ పరిశ్రమ అభివృద్ధి, కార్మిక సంక్షేమమే ఏఐటీయూసీ ప్రధాన ధ్యేయమన్నారు. కార్మిక హక్కుల సాధనకోసం నిరంతరం పోరాటం సాగిస్తూ మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. క్యాంటీన్‌ను మెరుగు పరిచామని, ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సౌకర్యాలను కల్పించామని, కార్మికుల ఆరోగ్యం, భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ఎప్పటికప్పుడు వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు.

సూరారం డివిజన్‌లో రోడ్లు అస్తవ్యస్తం

సత్వరమే మరమ్మతులు చేపట్టాలంటున్న స్థానికులు



హెచ్ఎంటీ సొసైటీ, జయశంకర్ కాలనీ, నెహ్రూనగర్‌లలోని రోడ్ల దుస్థితి

షాపూర్‌నగర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): సూరారం డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో రోడ్ల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. డివిజన్‌లోని షాపూర్‌నగర్, సంజయ్‌గాంధీనగర్, కళావతినగర్, రాజీవ్‌గాంధీనగర్, నెహ్రూనగర్, మార్కేండేయనగర్, న్యూషాపూర్ నగర్, జయశంకర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. గుంతలమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అభివృద్ధి పనుల పేరుతో కొన్ని ప్రాంతాల్లో ఎన్నికలకు ముందు రోడ్లను తవ్వి హడావిడిగా డ్రైనేజీ పైపులైన్‌లను వేశారు. తర్వాత తవ్విన గుంతలకు మరమ్మతులు చేయకుండా వదిలి వేశారు. దాంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారి నడవడానికి కూడా వీలు లేకుండా ఉన్నాయి. జయశంకర్‌నగర్ కాలనీలోని ప్రధాన రోడ్డులో సీసీ రోడ్డు వేయకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి గుంతల రోడ్లకు మరమ్మతులు చేసి, సీసీ రోడ్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు.



కంటి సంరక్షణ గురించి వివరిస్తున్న వైద్యులు

ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

నిజాంపేట్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక, లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రగతినగర్ జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో పిక్సెల్ ఐ హాస్పటల్ వారు గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి 22వ డివిజన్ కార్పొరేటర్ మాధవి హాజరయ్యారు. విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెన్నయ్య, లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె ప్రతాప్, జనవిజ్ఞాన వేదిక నాయకులు మల్లయ్యచారి, అనంతకుమారి, మేనేజర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

టెలికాంనగర్‌లో ....

రాయదుర్గం,జూలై 11 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని టెలికాం నగర్‌లో ఓమెగా హాస్టల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ధర్మగారి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్లు అర్చన, అనురాగ్, పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన

పేట్‌బషీరాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ కమ్యూనిటీహాల్లో ఆరోగ్య శాఖ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. డాక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో చేపట్టిన వైద్య శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీజనల్‌లో వచ్చే వ్యాధుల గురించి తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు వైద్యులు అవగాహన కల్పించారు.

ఫాక్స్‌సాగర్‌లో రెండు నిర్మాణాల కూల్చివేత

● నోటీసులు ఇవ్వకుండా కూల్చడంపై బాధితుల ఆగ్రహం

జీడిమెట్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్ల ఫాక్స్‌సాగర్‌లో అక్రమంగా వెలిసిన రెండు నిర్మాణాలను ఇరిగేషన్ అధికారులు గురువారం కూల్చివేశారు. పదేళ్ల క్రితం నిర్మించిన నిర్మాణాలను కూడా అధికారులు కూల్చివేడయంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఫాక్స్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన షెడ్‌లు, ఇతర పరిశ్రమల నిర్వాహణను అధికారులు అడ్డుకోకుండా మా షెడ్లను కూల్చివేయడం ఏంటని బాధితులు వాపోయారు. దూలపల్లి ప్రాంతంలో ఫాక్స్‌సాగర్ లోపలికి వచ్చి నూతనంగా నిర్మాణాలు చేపడుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. పదేళ్ల క్రితం కొంపల్లి మున్సిపాలిటీలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో పని చేసిన రాధాకృష్ణ అనే వ్యక్తి నుంచి స్థలాన్ని కొనుగోలు చేసి కరెంట్‌బిల్లు, ట్యాక్స్ కడుతున్నా, ముందుస్తుగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఏ విధంగా కూల్చివేశారని బాధితురాలు కోసూరి సత్యవతి ప్రశ్నించింది. ఇరిగేషన్ అధికారులు మాత్రం ఫాక్స్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో ఉన్న అన్ని నిర్మాణాలను తొలగిస్తామని పేర్కొన్నారు.

విద్యుత్ సౌత్ సర్కిల్‌ను అదానీ గ్రూపునకు ఇవ్వొద్దు



విద్యుత్ సంస్థ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్ ప్రతినిధులు

ఖైరతాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సౌత్ సర్కిల్‌ను అదానీ గ్రూపునకు ఇవ్వాలని చేస్తున్న ప్రయత్నాలను యాజమాన్యం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు మింట్ కాంపౌండ్‌లోని కార్పొరేట్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. గురువారం తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో యూనియన్ అధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు మాట్లాడుతూ సౌత్ సర్కిల్‌లో కరెంటు చోరీ జరుగుతున్నదని, బిల్లులు సరిగ్గా కట్టడం లేదని, ఆదాయం తక్కువగా ఉందని ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు చూడడం సరికాదన్నారు. సంస్థ బిల్లుల వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, ఉద్యోగులపై దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని రాజకీయాలకు తలొగ్గకుండా డీపీఈ, విజిలెన్స్‌లను వినియోగించుకుంటూ పని చేస్తే తమ యూనియన్‌తో పాటు అన్నియూనియన్లు సహకరిస్తాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సవరణ బిల్లు 2022 రద్దు చేయాలని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోని ఉద్యోగులు పోరాడుతున్న నేపథ్యంలో ప్రైవేటు సంస్థలకు సౌత్ సర్కిల్‌ను కట్టబెట్టే ప్రయత్నాలని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరినంటూ వసూళ్లకు పాల్పడితే కేసు: ఏసీపీ

మియాపూర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): నకిలీ ఐడీ కార్డులు చూపించి ఇళ్ల నిర్మాణ దారులను, వ్యాపారులను బెదిరించి డబ్బు వసూళ్లకు పాల్పడితే నూతన చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి కటకటాల్లోకి నెట్టివేస్తామని మియాపూర్ ఏసీపీ నర్సింహరావు హెచ్చరించారు. ప్రెస్ కార్డులు చూపించి డబ్బులు వసూళ్లు చేస్తున్నారని ఇటీవల పలు ప్రాంతాల నుంచి ఫిర్యాదులు అందాయని ఆయన అన్నారు.

బుధవారం మియాపూర్ కార్యాలయంలో ఏసీపీ గురువారం ప్రెస్‌నోట్ విడుదల చేశారు. కొందరు నకిలీ పాత్రికేయులు, రాజకీయ నాయకులమంటూ బెదిరింపులకు పాల్పడుతూ వారిపై రహస్యంగా విచారణ చేపట్టి కొందరిని గుర్తించామని ప్రెస్‌నోట్‌లో పేర్కొన్నారు. వారిపై నివేదికలను సిద్ధం చేశామని ఆన్నారు. త్వరలో వారిపై కొత్తగా అమలులోకి వచ్చిన చట్టాల ప్రకారం ఆర్గనైజెడ్ క్రైం కింద కేసులు నమోదు చేస్తామన్నారు. ఇంకా ఎవరైనా బాధితులు ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏసీపీ కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

24 గంటల్లో అందిన ఫిర్యాదులను విచారించి కొత్తచట్టం ప్రకారం కేసులు నమోదు చేసి బెదిరింపులకు పాల్పడిన వారు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యాపారస్తులు, నిర్మాణదారులు చట్టప్రకారం సరైన పద్ధతిలో అనుమతులు తీసుకొని నిర్మాణాలు, వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. అనుమతులు పొందిన వారు ఎవరికీ బయపడాల్సిన పనిలేదన్నారు.

ఈ మధ్యకాలంలో గుర్తింపులేని యుట్యూబ్ చానల్ వాళ్లు మేము జర్నలిస్టులమని అమాయక నిర్మాణదారులను బెదిరిస్తున్నారని, ట్రూకాలర్‌లో విజిలెన్స్ అధికారులుగా, జీహెచ్ఎంసీ అధికారులుగా పేర్లు పెట్టుకుని బెదిరిస్తున్నారని మాకు సమాచారము ఉందన్నారు. ఈ విధముగా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వ్యక్తుల విషయంలో జాగ్రత్తగా ఉంటూ సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం ఇస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీసీ రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టాలి: సబీహా బేగం

అల్లాపూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీవివేకానంద నగర్ కాలనీలో నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ గురువారం పరిశీలించారు. సీసీ రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టి, వేగంగా పూర్తి చేయాల ని కాంట్రాక్టర్‌కు సూచించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: దొడ్ల వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్,జూలై 11 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ స్థానికులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల అందజేత

కేపీహెచ్‌బి కాలనీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'మానవసేవే మాధవసేవ' కార్యక్రమంలో భాగంగా 9వ ఫేజ్‌లోని సహ్రుదయ వృద్ధాశ్రమానికి నిత్యావసరాలను అందజేశారు. వృద్ధులు, దివ్యాంగులు, అనాథలకు కొంత వరకు చేయూతనివ్వాలన్నది తమ సంకల్పమని ఆశ్రమ ఫౌండేషన్ కార్యదర్శి అప్పాజి శ్రీనివాస్ చెప్పారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీరామమూర్తి, ఉపాధ్యక్షుడు రవికుమార్, కోశాధికారి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు

వెంటనే విడుదల చేయాలి

● కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ నిరసన

ఖైరతాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకపోవడం శోచనీయమని, వెంటనే వాటిని విడుదల చేసి విద్యార్థుల ఉన్నత చదువులను ప్రోత్సహించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. గురువారం స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో గత 5 సంవత్సరాల నుంచి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8వేల కోట్లకు చేరుకున్నాయని, కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం సైతం విద్యార్థుల చదువు విషయమై అశ్రద్ధ చూపడం సరికాదని అన్నారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి నిధులను విడుదల చేయలన్నారు. లేనిపక్షంలో సీఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్ కార్యదర్శి అశోక్‌రెడ్డితో పాటు ప్రతినిధులు లెనిన్, స్టాలిన్, చరణ్‌శ్రీ, సునీల్, విఘ్నేష్, వంశబూ తదితరులు పాల్గొన్నారు.



మృతదేహంతో పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు

తండ్రి అనుమానిస్తున్నాడని...

ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

● దాడి చేస్తారనే భయంతో మృతదేహంతో పోలీసుల ఎదుట లొంగిపోయిన తండ్రి
● పోలీస్ స్టేషన్ ఎదుట బంధువుల ఆందోళన



శైలజ (ఫైల్)

చిలుపూర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): కన్న తండ్రే తనను అనుమానిస్తున్నాడని మనస్తాపానికి గురైన పదోతరగతి విద్యార్థిని సందెల శైలజ(14) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హైదరాబాద్ కూకట్‌పల్లి ప్రాంతంలోని ప్రశాంత్‌నగర్‌లో జరిగింది. అయితే ఈ ఘటనతో బంధువులు తనపై అనుమానం వ్యక్తం చేయడంతోపాటు, భౌతికదాడికి పాల్పడతారేమోనన్న భయంతో మృతురాలి తండ్రి శివ తన కుమార్తె మృతదేహంతో జనగామ జిల్లా చిలుపూర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం లొంగిపోయాడు. దీంతో పోలీస్‌స్టేషన్ ఎదుట కాసేపు తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కూకట్‌పల్లి సీఐ కృష్ణమోహన్, జనగామ జిల్లా రఘునాథపల్లి రూరల్ సీఐ శ్రీనివాస్‌యాదవ్, ఎస్ఐ ముత్యం రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల గ్రామానికి చెందిన సందెల శివ చిలుపూర్ మండలంలోని పల్లగుట్ట శివారులో ఉన్న మారెపల్లిగూడేనికి చెందిన దివ్యను వివాహం చేసుకున్నాడు. వారికి శైలజ జన్మించగా.. ఆమె చిన్నతనంలోనే తల్లి దివ్య చనిపోయింది. దీంతో శివ వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ల్యాబర్తికి చెందిన రేణుకను రెండో వివాహం చేసుకున్నాడు. రెండోభార్యకు ఇద్దరు కుమార్తెలు. జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చి కారుడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తన మొదటి భార్య కుమార్తె శైలజ మారెపల్లిగూడెంలోని అమ్మమ్మ ఇంట్లోనే ఉంటూ జనగామ జిల్లా, జఫర్‌గడ్ కేజీబీవీలో పదోతరగతి చదువుతోంది. ఇటీవల శైలజ అనారోగ్యానికి గురవడంతో తండ్రి శివ ఆమెను హాస్టల్ నుంచి బుధవారం హైదరాబాద్‌లోని తన ఇంటికి తీసుకెళ్లాడు. గురువారం తన పినతల్లి ల్యాబర్తిలోని పుట్టింటికి వెళ్లగా.. ఎప్పటి లాగే కారు డ్రైవింగ్‌కు వెళ్లిన శివ ఇంటికి వచ్చే సరికి కుమార్తె శైలజ ఉరేసుకుని ఉంది. సమాచారమందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అక్కడ శైలజ రాసిన సూసైడ్ నోట్ లభించింది. అందులో 'డాడీ నన్ను అనవసరంగా అనుమానించకు. నేను ఎవరితో ఎలాంటి తప్పు చేయలేదు. అనుమానం ఉంటే నాకు పెళ్లి చెయ్.. లేదంటే చనిపోయిన మా మమ్మీ వద్దకే వెళ్తా.. డాడీ ప్లీజ్' అని సూసైడ్ నోట్ రాసి ఉంది. దాని ఆధారంగా కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పోస్టుమార్టం అనంతరం సాయంత్రం శివ తన కుమార్తె మృతదేహాన్ని తీసుకుని అంబులెన్స్‌లో మారెపల్లిగూడెం బయల్దేరాడు. కానీ గ్రామంలోకి వెళితే బంధువులు తనపై భౌతిక దాడికి పాల్పడతారన్న భయంతో అంబులెన్స్‌ను చిలుపూర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులకు లొంగిపోయాడు. అయితే ఆత్మహత్యకు ముందు శైలజ రాసిన సూసైడ్ నోట్‌ను పరిగణనలోకి తీసుకుని కేసు నమోదు చేశామని కూకట్‌పల్లి సీఐ క్రిష్ణమోహన్ ఫోన్‌లో తెలుపగా.. చిలుపూర్ పోలీసులు తండ్రి శివను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.